
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
శనివారం, 10 మే 2025



నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

- అశ్వారావుపేటలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల పనులకు శంకుస్థాపనలు
- మంత్రులు తుమ్మల, పొంగులేటి హాజరు



అశ్వారావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. డిప్యూటీ సీఎం భట్టితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొందెం వీరయ్య, (మిగతా 6వ పేజీలో)

కాంగ్రెస్ వచ్చాక రైతులకు కష్టాలు

- ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిన ప్రభుత్వం
- ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు చేసింది శూన్యం
- కేసీఆర్ 'సీతారామ' ప్రాజెక్టు తెస్తే, ఆ నీటిని నెత్తిమీద చల్లుకుంటున్నారు
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- మిట్టపల్లిలో రాయల వెంకట శేషగిరిరావు విగ్రహావిష్కరణ
- హెలికాప్టర్‌లో వచ్చిన కేటీఆర్‌కు శ్రేణుల ఘనస్వాగతం

6



మిట్టపల్లిలో శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్

అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను ఏరివేయాలి

బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


6



ఖమ్మంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

దమ్మపేట మండలం గండుగులపల్లిలో నాలుగో పంపుహౌజ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి





భద్రాద్రి కలెక్టర్‌ను బైక్‌పై ఎక్కించుకుని సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ టన్నెల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

అణువణువూ పరిశీలిస్తూ..

అక్కడికక్కడే ఆదేశాలిస్తూ...

- సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై మంత్రి తుమ్మల పర్యవేక్షణ
- డిస్ట్రిబ్యూటరీ కాలువల భూ సేకరణ త్వరితగతిన చేపట్టాలని ఆదేశం
- యాతాలకుంట టన్నెల్ పనులు త్వరిగతిన పూర్తి చేయాలని సూచన
- గోదావరిలో వరద రాగానే ఇరు జిల్లాలకు సాగు నీరు అందిస్తామని వెల్లడి
- బైక్‌పై కలెక్టర్‌ను కూర్చొబెట్టుకొని టన్నెల్‌లో ప్రయాణించిన మంత్రి
- పనుల పూర్తిపై ఇరు జిల్లాల అధికారులతో సమీక్ష

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సత్తుపల్లి/కొత్తగూడెం, మే 9 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు అనుసంధానం చేసి వచ్చే నెల (జూన్)లోనే సాగునీరు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం సీతారామ ప్రాజెక్టు పనులు పరిశీలించి, ఉన్నతాధికారులతో సమీక్షించారు. భూ సేకరణ ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులు, అదనపు ఆయకట్టుకు ప్రణాళికలపై చర్చించారు. శాఖాపరమైన సమస్యలుంటే ఇరు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకుపోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా సీతారామ ప్రధాన కాలువకు సంబంధించి లోపల శుభ్రం చేయాలని, ఎక్కడైనా మరమ్మతులుంటే పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగు నెలల్లో యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తిచేయాలని సూచించారు.సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ప్రధాన కాలువ వెంట ఉన్న చెరువులను, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులను త్వరగా చేపట్టి పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, నియోజకవర్గాల్లో చెరువులను నింపి ఆయకట్టుకు నీరందించాలన్నారు. పనుల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఇరిగేషన్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి అనుమతులు సాధించాలని కోరారు.

తన పర్యటనలో మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట మండలం గండుగులపల్లిలో నిర్మాణం జరుగుతున్న నాలుగో పంపుహౌజ్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాదికి జూన్ నాటికి పూర్తికావాలని సూచించారు. ములకలపల్లి మండలం సీతారామ ఎత్తిపోతల పథకం అక్విడెట్ వద్ద ఇటీవల కూలిన పిల్లర్ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని నెలాఖరు లోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపరవు వద్ద ప్యాకేజీ 9 పనులు పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని కోరారు.

బైక్ నడుపుతూ టన్నెల్ పనుల పరిశీలన

గండుగులపల్లిలో పనుల పరిశీలన అనంతరం అక్కడినుంచి మంత్రి సత్తుపల్లి మండలం యాతాలకుంటలో టన్నెల్ పనులను పరిశీలించారు. స్వయంగా బైక్‌నడుపుతూ టన్నెల్ పనులు తిలకించారు. ముందుగా జీపులో ఎక్కిన మంత్రి... బురదగా ఉండడంతో ద్విచక్రవాహనం తీసుకుని వెనుక భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌ను ఎక్కించుకోగా, (మిగతా 6వ పేజీలో)

దంపతుల ఆత్మహత్య

- ఖమ్మం నగరంలో ఘటన
- కుటుంబ కలహాలే కారణం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివసించే దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే క్వార్టర్స్‌కు చెందిన రేవతి (37) ఖమ్మం నగరంలో రైల్వేగార్డుగా పని చేస్తోంది. భర్త కోటేశ్వరరావు (45) నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో వాచ్‌మేన్‌గా చేస్తున్నాడు. గత కొంత కాలంగా వీరి మధ్య కుటుంబ కలహాలు కొనసాగు తున్నాయి. కాగా శుక్రవారం రాత్రి భార్యా, భర్తలు గొడవపడటంతో భార్య రేవతి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త కోటేశ్వరరావు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా వీరికి ఒక కూతురు, కొడుకు ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రేవతి (ఫైల్)



కోటేశ్వరరావు (ఫైల్)

38 మంది మావోయిస్టుల లొంగుబాటు

- అందరూ ఛత్తీస్‌గఢ్ వాసులే
- ఒక్కొక్కరికి రూ.25వేల ఆర్థిక సహాయం

కొత్తగూడెం, మే 9 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగా మావోయిస్టు పార్టీకి చెందిన 38మంది సభ్యులు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయారు. వీరిలో 30 మంది పురుషులు కాగా 8 మంది మహిళా మావోయిస్టు సభ్యులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి ప్రభుత్వం తరఫున వెంటనే రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

హేమచంద్రాపురంలో ఉన్న జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను ఎస్పీ వెల్లడించారు. జిల్లా పోలీసు, సీఆర్‌పీఎఫ్ పోలీసు బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోలీస్ శాఖ కల్పిస్తున్న అభివృద్ధి సౌకర్యాల గురించి తెలుసుకుని నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకుని 38 మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ వివరించారు. వీరంతా (మిగతా 6వ పేజీలో)

యుద్ధభూమిలో మనోళ్లు..



వైమానిక సైనిక టీంలో ప్రమోద్‌కుమార్

- 'ఆపరేషన్ సిందూర్'లో పాల్వంచ ప్రాంత యువకులు
- సైన్యంలో వివిధ హోదాల్లో యుద్ధంలో తలమునకలు
- ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ రక్షణ కోసం ముమ్ముందుకు...
- యుద్ధం వేళ వారి కుటుంబాల్లో భావోద్వేగాలు

పాల్వంచ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ తలపెట్టిన 'యుద్ధం'లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ ప్రాంత యువకులు పాలుపంచుకుంటున్నారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సేనలు దాడులు తలపెడుతున్న క్రమంలో.. ఇక్కడి ప్రాంతవాసులు తమ సైనికులను తలుచుకుంటూ భావోద్వేగం చెందుతున్నారు. 'భారత్ మాతా కీ జై..' అని నినదిస్తున్నారు. పాల్వంచ ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు యుద్ధభూమిలో జవాన్లుగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దేశ రక్షణ కోసం ఇక్కడి నుంచి అనేక మంది యువకులు ఆర్మీ, బీఎస్ఎఫ్ బలగాల్లో నియమితులయ్యారు. ప్రస్తుతం వీరంతా జమ్మూకశ్మీర్, రాజోరి, పూన్చ్, నవసిర, అగర్తలా, గుజరాత్ బార్డర్‌లో సేవలందిస్తున్నారు.

సైన్యంలో వివిధ స్థాయిల్లో...

పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి చెందిన కట్టుపల్లి వరప్రసాద్ కశ్మీర్ బార్డర్‌లో హవల్దార్ కెప్టెన్‌గా పని చేస్తున్నారు. బయ్యావరపు శ్రీనివాస్ జూనియర్ కమాండెంట్‌గా సారేకల్లు గ్రామానికి చెందిన గంగిరెడ్డి వీరారెడ్డి జేసీవోగా, అహ్మద్ పాషా సుబేదర్‌గా, రాజాపురానికి చెందిన ప్రమోద్‌కుమార్ జేసీవోగా బాధ్యతల్లో ఉన్నారు. భారత్-పాకిస్థాన్ బార్డర్‌లోని సైనిక దళాల్లో తమవంతు బాధ్యతగా సైన్యంలో పని చేస్తుండటం ఈ ప్రాంతవాసులకు గర్వకారణంగా ఉంది. మూడు రోజుల నుంచి పాకిస్థాన్‌పై దాడులు కొనసాగుతున్న క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న వారి బాగోగులను కుటుంబసభ్యులు అడిగి తెలుసుకుంటున్నారు.

రిటైర్డ్ జవాన్ల స్ఫూర్తితో...

కట్టుపల్లి వరప్రసాద్ హవల్దార్ కెప్టెన్‌గా 20ఏళ్ల నుంచి అక్కడే ఉంటున్నాడు. ఈయన తండ్రి (మిగతా 6వ పేజీలో)



కశ్మీర్ బోర్డర్‌లోని బంకర్‌లో ఉన్న బయ్యావరపు శ్రీనివాస్



జి.వీరారెడ్డి

కాంగ్రెస్ వచ్చాక రైతులకు కష్టాలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

తల్లాడ, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలు అధికమయ్యాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తల్లాడ మండలందలోని మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దివంగత రాయల వెంకట శేషగిరిరావు విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన జరిగిన సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండుపంటలకు రైతుబంధు ఇస్తామని చెప్పి, నేడు ఒక్క పంటకు కూడా ఇవ్వడం లేదన్నారు. రూ.2లక్షల రైతురుణమాఫీ రైతులందరికీ జరగలేదన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు బోనస్ ఇవ్వడంలో కూడా కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఉప ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం చెందారని విమర్శించారు. ఢిల్లీకి పోతే దొంగలా చూస్తున్నారని రేవంత్‌రెడ్డి అంటున్నారని, దొంగను దొంగలానే చూస్తారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారని, వారు గత 17 నెలల్లో జిల్లాకు ఏం చేశారో ప్రజలు గమనించాలన్నారు. కేసీఆర్ ఉమ్మడి జిల్లా ప్రజలకోసం సీతారామ ప్రాజెక్టు తెస్తే ఆ నీరు నెత్తిన చల్లుకున్నారు కాని, ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బాండ్‌పేపర్‌పై అబద్దపు హామీలు ఇచ్చి, ఇచ్చిన హామీలను వందరోజుల్లో చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి వాటిని నెరవేర్చడంలో వైఫల్యం చెందారన్నారు. మార్పు కావాలని జిల్లా మొత్తం కాంగ్రెస్‌కు ఓటేశారని, కాంగ్రెస్‌ను నమ్మి మంచి నాయకులను ఓడగొట్టుకున్నారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పి బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ప్రజలకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా బీఆర్ఎస్ మాత్రమే పోరాడుతుందన్నారు. ఇంటిపార్టీ బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు.

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాయల వెంకట శేషగిరిరావు ప్రజల కోసం ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషిచేశారని కొనియాడారు. శేషగిరిరావు ఆశయసాధన కోసం కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పునరంకితం కావాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న శేషగిరిరావును కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాజకీయ దురుద్దేశంతో పదవీచ్యుతుడిని చేశారని తెలిపారు.

ఈ సభలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, హరిప్రియ, రేగా కాంతారావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, రాయల రఘునందన్, రాయల రేవంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, అంజనాపురానికి హెలికాప్టర్‌లో వచ్చిన కేటీఆర్‌కు హెలిప్యాడ్ వద్ద సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అంజనాపురంనుంచి మిట్టపల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కొమ్ముడోలు నృత్యం, సుగాలీలు నెత్తిన బిందెలతో నృత్యం చేస్తూపాల్గొన్నారు. పోట్రు ప్రవీణ్ భారీక్రేన్‌తో కేటీఆర్‌కు గజమాల వేశారు. పూలతో స్వాగతం పలికారు. కాగా సభ ప్రారంభానికి ముందు పహల్గాం మృతులకు సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించారు



ర్యాలీలో పాల్గొన్న కొమ్ము డోలు కళాకారులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు

అప్రమత్తంగా ఉండాలి

యుద్ధం నేపథ్యంలో కంపెనీల భద్రతాధికారులతో భద్రాద్రి ఎస్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, మే 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల భద్రతాధికారులతో శుక్రవారం సమావేశాన్ని ఎస్పీ రోహిత్‌రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేశారు. భారత్- పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో పరిశ్రమలు, భద్రతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అశ్వాపురం భారజల ఉత్పత్తి కేంద్రం, సారపాక ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, నామా లిమిటెడ్ కంపెనీల భద్రతాధికారులు, సంబంధిత పోలీసు అధికారులతో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పరిశ్రమలు,, కంపెనీల్లో ప్రస్తుత భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న నియమ నిబంధనలను పాటిస్తు దానికి అనుగుణంగా పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భారజల కేంద్రం కమాండెంట్ అమిత్‌కుమార్, మణుగూరు, పాల్వంచ ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, సతీష్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, ఐటీసీ సెక్యూరిటీ ఆఫీసర్ మనీష్ శర్మ, కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, బీటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ ఫలాలు

- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



ఏంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. భద్రాచలం పట్టణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించి పార్టీ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలలో పూర్తిగా విఫలమైందని అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి, సంతోష్‌కుమార్, సీతాలక్ష్మి, లాలావతి, జ్యోతి, నాగరాజు, శ్రీనివాస్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా

ఉద్యమించాలి

- సీతారామ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఫాసిజం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడారు. ఫాసిజం, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా శ్రామికవర్గ పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టును సతర్వమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో గోదావరి జలాలు అందించామని మంత్రులు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తి కావటానికి మరో రూ.19వేల కోట్లు వ్యయం అవసరముందన్నారు. రుణమాఫీ కూడా కేవలం 40 శాతం జరిగిందన్నారు. ఈనెల 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వై.విక్రమ్, వీరభద్రం, మాదినేని రమేశ్, ఎర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

24,050 ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యం

- ఉపాధిహామీ పనులకు నిత్యం 45వేల మంది కూలీలు
- వ్యవసాయ భూముల్లో నీటికుంటల తవ్వకాలకు ముమ్మర చర్యలు
- విలేకరులతో అడిషనల్ డీఆర్‌డీవో రవి



నారంవారిగూడెంకాలనీలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు పెంచటానికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 24,050 ఇంకుడు గుంతల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో 5,343 ఇంకుడు గుంతలను నిర్మించటం జరిగిందని అడిషనల్ డీఆర్‌డీవో ఎస్.రవి తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని నారంవారిగూడెం కాలనీలో పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చేపట్టిన ఇంకుడు గుంతలను శుక్రవారం అడిషనల్ డీఆర్‌డీవో రవి పరిశీలించారు. నిర్మాణాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ ద్వారా జిల్లాలో ప్రతి పది ఎకరాలకు ఒక నీటికుంటను ఏర్పాటు చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ ముమ్మరంగా సాగుతుందన్నారు. జిల్లాలో 1,22,732 మంది రైతులకు చెందిన 3,46,286 ఎకరాల భూమి ఉందని, ఆయా భూముల్లో 34,628 నీటి కుంటల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చిన్న నీటికుంటలకు రూ.3లక్షలు, పెద్దవాటికి రూ.4లక్షలను మంజూరు చేసి కూలీల చేత పనులు చేయించటం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 45వేల మంది పైచిలుకు కూలీలు పనులకు వస్తున్నారని, ప్రతిపంచాయతీ నుంచి 90మందికి తగ్గకుండా పనులకు వచ్చేలా చూస్తున్నామన్నారు. ఈఏడాది 26.21 లక్షల పనిదినాలకు అనుమతులు ఉన్నాయని, ఇప్పటివరకు 9.31లక్షల పనిదినాలు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో ఉపాధిహామీ ద్వారా రూ.25.74కోట్ల చెల్లింపులు జరిగాయని, ఇందులో వేతనాలకే రూ.23.77కోట్ల చెల్లింపులు జరిగాయని వివరించారు. అడిషనల్ డీఆర్‌డీవో వెంట ఏపీవో రామచంద్రరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- మే 17 లోగా దరఖాస్తు చేసుకోండి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): మే 17లోగా లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తోందని, ఆసక్తి గల అభ్యర్థులు మీ సేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందాలని, మే 17లోపు తమ దరఖాస్తులను మీ సేవ కేంద్రాల్లో మాత్రమే సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్ గణిత శాస్త్రం ఒక అంశంగా 60శాతం కనీస మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్ మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో 50 పని దినాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు, శిక్షణ కోసం ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 శిక్షణ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 8374879945, 9705439983, 9676964860 నెంబర్ల లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో అధికారులతో సమీక్ష సమావేశం, ప్రజలతో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. దమ్మపేట మండలం, పార్కెలగండిలో మంజూరైన 33/11 కేవీ సబ్ స్టేషన్, అశ్వారావుపేట మండలం అచ్యుతాపురంలో మంజూరైన 33/11 కేవీ సబ్ స్టేషన్, అశ్వారావుపేట- 2 33/11 కేవీ సబ్ స్టేషన్, తిరుమల కుంటలో మంజూరైన 33/11 కేవీ సబ్‌స్టేషన్, కావడిగుండ్లలో మంజూరైన 33/11 కేవీ సబ్ స్టేషన్, 44/220 కేవీ సబ్‌స్టేషన్ పనులకు అశ్వారావుపేటలోనే శంకుస్థాపనలు జరుగుతాయని, ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

‘ఆపరేషన్ సిందూర్’కు సంఘీభావం

- నగరంలో కేఎంసీ, మెప్మా ఉద్యోగులు ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కేఎంసీ, మెప్మా ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా ఉద్యోగులు, రిసోర్స్ పర్సన్లు మద్దతు తెలిపారు. కేఎంసీ కార్యాలయం నుంచి గట్టయ్య సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని జై భారత్, ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. తర్వాత గట్టయ్య సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టిస్తున్న భారత సైన్యానికి అండగా ఉంటామని, నగర పాలక సంస్థ ఏవో శివలింగం, ఆర్వో శ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. భారత ఆర్మీలో మహిళలు కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్లు చంద్రకళ, ఉపేందర్, ఆర్ఐ జ్యోతి, రాంబాయి, శ్రీనివాస్, మెప్మా సీవోలు సయ్యద్ సల్మా, రోజా, శానిటరి ఇన్‌స్పెక్టర్లు శంకర్, భీమయ్య, రిసోర్స్ పర్సన్‌లు అనురాధ, విజయలక్ష్మీ, నాగమణి, శాంతి, జయ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభూమిలో మనోళ్లు..

(5వ పేజీ తరువాయి)

ఆర్మీలో పని చేసి రిటైరయ్యారు. శ్రీనివాస్, వీరారెడ్డి, అహ్మద్ పాషా, ప్రమోద్‌కుమార్, సయ్యద్ అమీర్ 15 ఏళ్లుగా వైమానిక దళాల్లో పని చేస్తున్నారు. మొదట భారత్ సరిహద్దులోని పాకిస్థాన్ సమీప సరిహద్దులో 500 మీటర్ల దూరంలో ఉన్న బంకర్లలో పని చేస్తూ విధి నిర్వహణలో తమదైన ప్రతిభను కనబరుస్తూ జూనియర్ కమాండెంట్‌స్థాయి ఎదిగారు. ఈ ప్రాంతం నుంచి కిన్నెరసాని, రాజాపురం, సారెకల్లు, యానంబైలు గ్రామాల నుంచి ఆర్మీకి వెళ్లి ఇప్పుడు దేశ రక్షణ కోసం పోరాడుతున్న జవాన్లను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

గతంలో ఆర్మీలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన వారు అనేకమంది పాల్వంచలో ఉన్నారు. గతంలో పని చేసిన కట్టుపల్లి లూకా, రవూఫ్, సుభాని, ఇమాముద్దీన్, అమీన్, ఇమానీయల్ ప్రోత్సాహంతో యువకులు ఆర్మీకి వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. యుద్ధంలో భారత్ సైనిక దళాల్లో పనిచేస్తున్న ఈ ప్రాంత జవాన్ల కుటుంబసభ్యులు ప్రతి రోజు సమాచారం తెలుసుకుంటున్నారు. గ్రామస్థులు జవాన్ల కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ధైర్యాన్ని నింపుతున్నారు. మీడియాలో వస్తున్న యుద్ధ వార్తలను ఎప్పటికప్పుడు చూస్తున్నారు.

బంకర్‌లో 30మంది సైనికులు

జి.వీరారెడ్డి, జూనియర్ కమాండెంట్

మాకు కేటాయించిన బంకర్‌లో 30మంది సైనికదళంలో ఉంటున్నాం. పాకిస్థాన్‌కు 500 మీటర్ల దూరంలో డ్రోన్స్, ఫైర్ కదలికలను కనిపెడుతున్నాం. అక్కడక్కడ ప్రొక్లెయినర్లతో తవ్విన గుంతల్లో ఉంటూ పాకిస్థాన్ నుంచి వచ్చే డ్రోన్లపై సైనికదళం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

1971లో ఇలాంటి పరిస్థితి వచ్చింది


మాజీ సైనికుడు లూకా



నా కుమారుడు వర ప్రసాద్‌ను డిగ్రీ పూర్తికావడంతో 25 ఏళ్ల క్రితం ఆర్మీలోకి పంపించాను. 1971లో ఇలాంటి యుద్ధ పరిస్థితి వచ్చింది. అప్పుడు ఇంత టెక్నాలజీ లేదు. శత్రువును ఓడించడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు నా కుమారుడు పోరాడుతున్నాడు.

38 మంది మావోయిస్టుల లొంగుబాటు

(5వ పేజీ తరువాయి)



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీలో వివిధ కేడర్‌లో పని చేసిన 265 మంది మావోయిస్టు సభ్యులు వివిధ హోదాల్లో పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ ఆపరేషన్ రవి పాల్గొన్నారు.

అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను ఏరివేయాలి

- బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఖమ్మం మార్కెట్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమంగా మదర్సాలలో నివాసం ఉంటున్న పాకిస్థానీయులను, రోహింగ్యాలను, బంగ్లాదేశీయులను వెంటనే ఏరివేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ‘వన్ నేషన్ వన్ ఎలక్షన్’పై జరిగిన అవగాహనా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధానికి సంఘీభావంగా టాంక్‌బండ్‌పై ర్యాలీలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా రాష్ట్రంతో పాటు జిల్లాల్లో అక్రమ వలసదారులను గుర్తించి బయటకు పంపాలని, అదే ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. భారతదేశం మీద ఉగ్రదాడులు, కవ్వింపు చర్యలకు పాల్పడితే పాకిస్థాన్ తాట తీస్తాం అని పేర్కొన్నారు.

ఈ దేశంలో ఉంటూ ఈ దేశం సొమ్ము తింటూ ఈ దేశ సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా టెర్రరిస్టులకు అనుకూలంగా మాట్లాడుతున్న కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులను దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి, వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంకా రెచ్చగొట్టే చర్యలు చేస్తే 10 రోజుల్లో ప్రపంచ చిత్రపటంలో పాకిస్థాన్ అనే దేశం లేకుండా చేసే దమ్ము మన మిలటరీకి ఉందని అన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, గెంగూర వెంకటేశ్వరరావు ఉన్నారు.

అణువణువూ పరిశీలిస్తూ..

అక్కడికక్కడే ఆదేశాలిస్తూ...



రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

(5వ పేజీ తరువాయి)

అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ.. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఎక్కించుకున్నారు. బురదలోనే బైక్‌నడుపుతూ టన్నెల్‌లో 1.2 కి.మీ. వరకు వారు ప్రయాణించారు. పనులు జరుగుతున్న చోట ఆగి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 1.8 కి.మీ.కు గాను 1.2 కి.మీ. పొడవున పనులు పూర్తిచేశామని, ఇంకా 600మీటర్ల సొరంగం తవ్వాల్సి ఉందని తెలుపగా నాలుగునెలల్లో పూర్తిచేయాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

గోదావరిలో జూన్‌లో వరదనీరు రాగానే మూడు సీతారామ లిఫ్టుల ద్వారా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని సాగుభూములకు నీరందించి గోదావరి జలాలతో సస్యశ్యామలంచేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. సమీక్ష సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు గోదావరికి ఎగువన కురిసే వర్షాలతో ముందుగానే వరదనీరు వస్తుందని, సీతారామ మూడు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు గోదావరి జలాలు ఈ సారి అందనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌ను నింపి వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని లక్షా 30 వేల ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణ చేస్తామని తెలిపారు.

కృష్ణాలో నీరు లేకపోయినా గోదావరి జలాలతో సాగునీరు అందుతుందన్నారు. ప్రధాన కాలువ వెంట డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయడం జరుగుతుందని, ఈ లోగా సీతారామ ఎత్తిపోతల కాలువ వెంట ఉన్న చెరువులకు సాగునీరందిస్తామన్నారు. పినపాక నియోజకవర్గంలోని తుమ్మలపల్లి చెరువుతో పాటు మారేడుపాక లిఫ్టు ద్వారా 25 ఎకరాలకు సాగునీరు ఇస్తామని కొత్తగూడెం నియోజకవర్గంలోని సింగభూపాలెం, అశ్వారావుపేట నిఅయోజకవర్గంలోని మూకమామిడి తదితర చెరువులను నింపి సాగునీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజీవ్ కెనాల్ వెంట ఎక్కడైన చెరువులుంటే అక్కడకూడా గోదావరి జలాలు అందించడం జరుగుతుందని వివరించారు. పెదవాగు ప్రాజెక్టు పనులు కూడా చేపడుతున్నామని, ఏపీ ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని 80శాతం ఏపీ, 20 శాతం తెలంగాణ నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సిందే...

- మాచినేనిపేట తండాలో గిరిజన మహిళల ఆందోళన
- పంచాయతీ కార్యాలయం గేటుకు తాళం వేసి ధర్నా



ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

జూలూరుపాడు, మే 9(ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని మాచినేనిపేటతండా గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదుట గిరిజన మహిళలు ఆందోళన చేశారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతి కార్యాలయం లోపల విధుల్లో ఉన్న సమయంలోనే పంచాయతీ పరిధిలోని పెద్దతండా గ్రామానికి చెందిన పలువురు మహిళలు కార్యలయం గేటుకు తాళం వేసి ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు వారు ఆందోళన కొనసాగించారు. పంచాయతీ పరిధిలో 114 మందిని ఇందిరమ్మ ఇళ్ల మంజూరీకి అర్హులుగా గుర్తించి అధికారులు ఎల్-1 జాబితా రూపొందించారు. వారిలో తొలి విడతలో 31 మంది లబ్దిదారులకు ఇళ్లను మంజూరీ చేస్తూ జాబితాను విడుదల చేశారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పూరి గుడిసెలు, రేకుల షెడ్‌లలో నివసిస్తూనప్పటికి నిరుపేదలమైన తమకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయకుండా భూములు, ఇళ్లు ఉన్న అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి తమకు అన్యాయం చేశారని మహిళలు వాపోయారు. అధికార పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రూ. 70వేల నుంచి లక్ష రూపాయల వరకు డబ్బులు తీసుకుని అనర్హులకు ఇళ్లను మంజూరీ చేశారని ఆరోపించారు. మొదటి విడత జాబితాను రద్దుచేసి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లకావత్ భాగ్యలక్ష్మీ, ఎల్.విమల, బానోత్ బుజ్జి, దేవి, డి.అరుణ, డి.బద్రి, అచ్చి తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్ నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలి

ములకలపల్లి/ అన్నపురెడ్డిపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని సీతారామ ఎత్తిపోతల పథకం అక్విడెక్ట్(సూపర్ ప్యాసేజ్) కూలిన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. పూసుగూడెం నుంచి కమలాపురం పంప్‌హౌస్‌కు వెళ్లే కాల్వ మార్గంలో మాదాపురం దాటిన తర్వాత 48.3 కిలోమీటర్ల వద్ద సమీప గుట్టపై నుంచి వచ్చే నీటి కాల్వలోకి బదులుగా బయటకు వెళ్లేలా అక్విడెక్ట్ మొత్తం నాలుగు పిల్లర్లతో నిర్మించగా ఒక పిల్లర్ గత నెలలో కూలింది. కూలిన దాని స్థానంలో కొత్త పిల్లర్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి పిల్లర్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జూన్ 15వ తేదీ నాటికి కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా గడ్డి, చెట్లను, చెత్తను శుభ్రంచేయాలని, వర్షాకాలం గోదావరికి నీటి ప్రవాహం రాగానే సీతారామ ఎత్తిపోతల ద్వార సాగర్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని, అప్పుడే నీటి ప్రవాహానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కెనాల్‌ను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి ఈ సీతారామ కాల్వలో ఉన్న మరమ్మతులు, మిగిలిన పనులన్ని పూర్తి చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండ చూడాలని, సీతారామ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 30వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతుందన్నారు. వచ్చే వర్షాకాలం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వార ఉమ్మడి జిల్లాలో ఉన్న చిన్న, మధ్య తరహా, చెరువులు, ప్రాజెక్టులను నింపడానికి సన్నద్ధంగా ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఇరిగేషన్ ఈవో శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్సీ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా శుభ్రం చేయాలి
- సీతారామ కాల్వ ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అధికారుల నుంచి పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయండి

నాలుగు నెలల్లో సీతారామ ప్రాజెక్టు కాలువ ద్వార సాగు నీరు అందించాలని ప్రభుత్వం సంకల్పిస్తుందని దీన్ని దృష్టిలో ఉంచుకుని పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారె ఆదినారాణతో కలిసి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇంజనీరింగ్ అధికారులను వెంటబెట్టుకొని అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు రెవెన్యూ పరిధిలో తొమ్మిదవ ప్యాకేజ్‌లో జరుగుతున్న కాలువ పనులను పరిశీలించారు. పనులు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో మంత్రి మాట్లాడుతూ సాగు నీటికోసం రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నిరంతరం పర్యేక్షిస్తూ పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సమయంలో కొందరు రైతులు మంత్రిని కలిసి ధాన్యం కొనుగోలు జరగటంలేదని ఫిర్యాదు చేశారు. ధాన్యం వేగంగా కొనుగోలు చేయించేదకు చర్యలు తీసుకోవాలని ప్రక్కనే ఉన్న కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాదికల్లా సీతారామ నీళ్లు..

దమ్మపేట, మే 9(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ పనులు, కాలువ పనులు పూర్తి చేసి 2026 జూన్ నాటికి అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు సాగునీటిని అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ పనులను పరిశీలించారు. జరుగుతున్న పనుల వివరాలు, ప్రగతి ఏ విధంగా ఉందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరందించడం ద్వార వారి పురోగతికి పాల్పడాలని నిశ్చయించిందని, ఇప్పటికే రైతుల కోసం అనేక పథకాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. పనుల్లో వేగం, నాణ్యతగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, దొడ్డ ప్రసాద్, కొయ్యల అచుతరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగ ప్రసాద్, ఎర్ర వసంతరావు, కేవీ సత్యనారాయణ, మన్యం అప్పారావు, కాసాని మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మూసివేసిన మద్దుకూరు కొనుగోలు కేంద్రం

ధాన్యం కొనుగోళ్లు బంద్

- కేంద్రాల్లో పేరుకు పోయిన నిల్వలు
- క్వింటాకు ఐదారు కేజీల తరుగు తీస్తేనే దిగుమతి
- మిల్లర్ల లీలలతో రైతులు ఆందోళన

చంద్రుగొండ, మే9 (ఆంధ్రజ్యోతి): మిల్లర్ల లీలలతో ధాన్యం రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తరుగు, తేమ పేరుతో క్వింటాకి 5నుంచి6 కిలోల కోత విధిస్తున్నారని, అంగీకరించకుంటే ధాన్యాన్ని వెనక్కి పంపిస్తామని మిల్లరు బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవటంతో భారీగా ధాన్యం నిల్వలు పేరుకుపోయ్యాయి. నిత్యం వర్షాలు కురుస్తుండటంతో కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యాన్ని కాపాడుకోంటం రైతులకు కష్టంగా మారింది. స్థానిక అధికారులు, సిబ్బంది గత ఆరు రోజుల నుంచి ఎంత ప్రయత్నిస్తున్నా ఐదు కేంద్రాల నుంచి ఒక్క లారీ ధాన్యన్ని తరలించలేక పోయారు. ఇది ఇలా ఉండగా మద్దుకూరు కొనుగోలు కేంద్రానికి ఏకంగా కర్రలు కట్టి కేంద్రాన్ని మూసివేశారు. కేంద్రాన్ని పర్యేక్షిస్తూ రైతులకు వివరాలు తెలపాల్సిన సిబ్బంది జాడలేరు దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం నిల్వలు పేరుకు పోవటానికి లారీల కొరత కూడా ఒక కారణమని సహకార సంఘం సీఈవో నరసింహరావు తెలిపారు.

13న వాహనాల వేలం

అశ్వారావుపేట రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట ఆబ్కారీ స్టేషన్‌లో ఈనెల 13న వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సాంబమూర్తి, ఎస్ఐ రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్యాలయం వద్ద 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, పాటదారులు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని సీఐ సాంబమూర్తి కోరారు.

చెట్టు పడి దుక్కిటెద్దు మృత్యువాత

ఆళ్లపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): గాలికి చెట్టువిరిగి దుక్కిటెద్దుపై పడటంతో దుక్కిటెద్దు మృత్యువాత పడిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో గురువారం రాత్రి జరిగింది. ఆళ్లపల్లి మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన కుంజ నాగేష్ అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు గురువారం రాత్రి గాలి,. వర్షానికి చెట్టు కిందకు వెళ్లడంతో, గాలికి చెట్టు విరిగి దుక్కిటెద్దుపై పడి మృతి చెందింది. శుక్రవారం రైతులు గమనించి, పశువర్ధక అధికారులకు తెలియపరిచారు. ఎద్దు ఖరీదు సుమారు రూ.60 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం, మే9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీజీ కొత్తూరు స్టేజీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన మిద్దె నరేష్(32) గత కొంత కాలంగా సారపాక ఐటీసీ కార్మాగారంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తూ సారపాకలో ఉంటున్నాడు. ఈనేపథ్యంలో నరేష్ శుక్రవారం తనబైక్‌పై మణుగూరులో ఒకశుభకార్యానికి వెళ్లివస్తున్నాడు. మార్గమధ్యంలో బీజీ కొత్తూరు స్టేజీ సమీపంలో కొత్తగూడెం నుంచి మణుగూరువైపు వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొనటంతో నరేష్ సంఘటనాస్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న అశ్వాపురం ఎస్ఐ మధుప్రసాద్ సంఘటనా స్థలానికిచేరుకుని వివరాలు సేకరించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.


సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ మధుప్రసాద్

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

మణుగూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చుక్కుడు గుంట గ్రామానికి చెందిన కమ్మిశెట్టి సురేష్(40) శుక్రవారం తెల్లారుజామున ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. అవివాహితుడైన సురేష్ కూలి పనులపై ఆధార పడి జీవిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి తన సమీప బంధువులతో ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వరరామచంద్రాపురం మండలం రాయగూడెం గ్రామానికి చెందిన సురేష్ గత కొంత కాలంగా చుక్కుడు గుంట గ్రామంలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరవక పోవడంతో స్థానికులు అనుమానంతో తలుపులు తీసి చూడగా లోపల ఉరి వేసుకుని విగత జీవిగా సురేష్ కనిపించాడు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు రైతు దుర్మరణం



అశ్వారావుపేట రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు రైతు మృతిచెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గుమ్మడివల్లి గ్రామానికి చెందిన సాధనం రాజారావు(50) తన పొలంలో ఉన్న బెండకాయలను కోసేందుకు వెళ్లాడు. రాజారావుతో పాటు మరో ఇద్దరు చిన్నారులు తోట వద్దకు వెళ్లినట్లుగా సమాచారం. అదే సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు మెరుపులతో జల్లులు పడ్డాయి. దీంతో రైతు సమీపంలో ఉన్న వేపచెట్టు వద్దకు వెళ్లాడు. పిల్లలు దూరంగా ఉండటంతో వారు నడుచుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో చెట్టుపై పిడుగుపడటంతో రాజారావు అక్కడికక్కడే మృతిచెందాడు. దీన్ని చూసిన ఇద్దరు చిన్నారులు పరుగులు పెడుతూ ఊళ్లోకి వెళుతుండగా కింద పడిపోయారు. సమీపంలో ఉన్న ఇంట్లోని వారు చూసి చిన్నారులను లేపి అడగగా రాజారావు చెట్టుకింద పడిపోయిన విషయం చెప్పటంతో గ్రామస్థులు వచ్చి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్ గుమ్మడివల్లి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహనికి నివాళులు అర్పించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఎంతో చురుకుగా వ్యవహరించే రాజారావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేటకు తరలించారు.

పంటలకు రక్ష భూసార పరీక్ష

ఇష్టారీతిన రసాయనిక ఎరువుల వినియోగంతో భూమి సారం కోల్పోయి నిర్జీవంగా మారుతుంది. పంట భూమిలో నత్రజని, భాస్వరం, సేంద్రియ కర్బనాల్లాంటి పోషకాలు ఎంత మోతాదులో ఉన్నయో భూసార పరీక్షల ద్వారా తెలుసుకుని వాటికి తగ్గట్టుగా మొక్కలకు ఎరువులను అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. భూసార ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల తదితర అంశాలు తెలుస్తాయి. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాల తోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



- భూసారపరీక్షలతో అన్నదాతలకు లాభం
- తగిన పోషకాలు ఉపయోగించే అవకాశం
- జిల్లాలో 2 భూసార పరీక్షా కేంద్రాలు
- ఒక్కో నమూనా పరీక్షకు రూ. 10 రుసుం

ఖమ్మం వ్యవసాయం, మే9(ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో రెండు భూసార పరీక్ష కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఖమ్మం జిల్లాకేంద్రంలో ఒక కేంద్రం ఉండగా, మరొక కేంద్రం సత్తుపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భూసార కేంద్రం. ఈ రెండు కేంద్రాలో మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఈ నమూనాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ద్వారా సేకరిస్తారు. ఒక వేళ రైతులు స్వచ్ఛందంగా మట్టి నమూనాలను ప్రయోగశాలకు తీసుకువస్తే ఒక్కో నమూనాకు రూ.10 రుసుం తీసుకుని పరీక్ష చేసి రిపోర్టులను అందజేస్తారు. మట్టి నమూనాలు సుమారు 1 ఎకరం నుంచి 5 ఎకరాల వరకు ఒక నమూనా చొప్పున సేకరిస్తారు.

నమూనాలను సేకరించే విధానం..

పొలాల్లో పంట లేని సమయంలో మాత్రమే భూసార పరీక్షలకు మట్టి సేకరించాలి. నేల పొడిగా ఉన్నప్పుడు పొలం ఆరి ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలి. సరిగ్గా చెప్పాలంటే మార్చి నుంచి మే నెల మధ్య సేకరించాలి. పండ్ల తోటలు సాగు చేసే రైతులు చెట్లకు ఎరువు వేయక ముందే మట్టి నమూనాలు తీసుకోవాలి. మట్టి వెళ్లే లోతు వరకు, ఏక వార్షిక పంటలకు 15 నుంచి 30 సెంటీమీటర్లలోపు మట్టి నమూనాలను సేకరించాలి. పొలంలోని గట్ల వద్ద, పంట కాల్వల్లో సేకరించకూడదు. మొక్కలు, చెట్ల కింద, చెట్ల పక్కన ఉన్న మట్టిని సేకరించకూడదు. కంపోస్టు, పశువుల ఎరువుల కుప్పలు ఉంచిన చోట, బురదగా ఉన్న నేల నుంచి నమూనాలు పనికిరావు. నమూనాలు తీసేటప్పుడు నేల పైభాగంలోని చెత్తాచెదారాన్ని తీసివేయాలి. తీసిన చోట తేమ ఎక్కువగా ఉంటే నమూనాను నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టకూడదు. మట్టిని ఒక చోట నుంచి కాకుండా 10 నుంచి 15 ప్రాంతాల్లో తీయాలి. ఎంపిక చేసిన పొలంలో జిగ్‌జాగ్ (ఎగుడు దిగుడు) పద్ధతిలో సేకరించాలి. మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నెంబర్, గ్రామం, మండలం, పంటల వివరాలు, ఫోన్ నెంబర్‌ను జత చేయాలి.

లక్ష్యం పూర్తి

గత ఏడాది నిర్దేశించిన విధంగా ఖమ్మం కేంద్రంలో 6000, సత్తుపల్లి కేంద్రంలో1627 మట్టి పరీక్షలు పూర్తిచేశారు. ఈ లెక్కన వంద శాతం లక్ష్యం పూర్తయింది. ఈ వానాకాలానికి ఇంకా ఎన్ని మట్టి పరీక్షలు చేయాలో లక్ష్యం నిర్దేశించాల్సి ఉంది.

రైతులకు లాభాలు ఇవీ..

భూపరీక్షల ద్వారా భూమి స్వభావం తెలుస్తుంది. మృత్తిక ఏ రకానికి చెందిందో తెలుస్తుంది. దానిలో ఉన్న పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. వాటిని బట్టి రైతులు పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులు ఉండవు. పరీక్షా ఫలితాల్లో ఏ భూమి తేలిక నేల, బరువు నేల, మధ్యస్థంగా ఉన్న నేల అనే విషయాలు తెలుస్తాయి. నేలకు అమ్ల గుణం ఉంటే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సున్నం వాడి స్థాయి తగ్గించవచ్చు.

సింగరేణిలో రాజుకుంటున్న సమ్మె

- తగ్గేదేలేదంటున్న కార్మికసంఘాలు
- సమ్మెలపై ఆరు నెలలు నిషేధం విధించాం
- సింగరేణి యాజమాన్యం

రుద్రంపూర్, (సింగరేణి) మే 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఈ నెల 20వ తేదీన సమ్మె నిర్వహించి తీరుతామని ప్రధాన కార్మికసంఘం నాయకులు ప్రకటించారు. కార్మికచట్టాలను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు దేశ వ్యాప్తంగా అన్ని కార్మికసంఘాలు ప్రభుత్వరంగ సంస్థల్లో సమ్మెను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే సింగరేణిలోని ప్రధాన కార్మిక సంఘాలైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), సింగరేణి ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ), విప్లవ కార్మికసంఘాలు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్లు సమ్మెను విజయవంతం చేయాలంటూ సింగరేణి మైన్స్, ఓపెన్‌కాస్టులు, డిపార్టుమెంట్లు, సింగరేణి ప్రధాన ఆసుపత్రి, సింగరేణి ప్రధాన కార్యాలయంలో గేట్ మీటింగ్‌లు పెడుతూ సమ్మె ప్రాధాన్యం వివరిస్తున్నాయి.ఈ తరుణంలో సింగరేణి యాజమాన్యం సింగరేణిలో ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

ఎట్టి పరిస్థితుల్లో సమ్మె చేసి తీరుతాం

వంగా వెంకట్, ఏఐటీయూసీ కేంద్రకమిటీ నాయకుడు



కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నిర్వహించే సమ్మెను చేసి తీరుతాం. సింగరేణి యాజమాన్యం ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు సృష్టించిన ఈ నెల 20వ తేదీన సమ్మెకు కార్మికులంతా అండగా నిలుస్తారు. దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణితోపాటు అన్ని ప్రభుత్వరంగసంస్థ కార్మికులు భాగస్వాములు కానున్నారు.

కార్మికుల పక్షాన నిలబడతాం



త్యాగరాజన్, ఐఎన్‌టీయూసీ, సీనియర్ ఉపాధ్యక్షుడు

హక్కుల సాధన కోసం కార్మికుల పక్షాన నిలపడతాం.. సింగరేణిలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే సమ్మె విజయవంతమవుతుంది. కార్మికులు సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు.

సమ్మె కార్మికుల హక్కు

మందా నర్సింహారావు, సీఐటీయూ కార్యదర్శి



సమ్మె కార్మిక ప్రాథమిక హక్కు అని సమ్మెను నీరుగార్చే ప్రయత్నాన్ని అడ్డుకుంటాం.. సమ్మెను విజయవంతం చేస్తాం..కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది. సింగరేణిలో సమ్మెను యథావిధిగా కొనసాగిస్తాం.

104 కిలోల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

భద్రాచలం, మే 9(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 104 కిలోల గంజాయి పట్టుబడింది. భద్రాచలం శివారులోని ఇసుక ర్యాంపు సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదికారులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో అనుమానంగా వెళుతున్న కారును తనిఖీ చేయగా 75కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయి, కారుతో కలిపి రూ.41లక్ష విలువ ఉంటుందని తెలిపారు. కారులో ఉన్న రాజస్థాన్‌కు చెందిన అనిల్‌కుమార్‌శర్మ, ముఖేష్ కుమార్ దేవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిసా నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. పాల్వంచకు చెందిన దుర్గాప్రసాద్ గంజాయి సరఫరా చేసినట్లు నిందితుల విచారణలో వెల్లడించారు.

భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీషా బేగం, ఎస్ఐ అల్లూరి సీతారామరాజు కలిసి భద్రాచలం ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అట్టి సమయంలో కారు అతివేగంగా రావడం గమనించి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ.14,50,000 విలువ చేసే 29.50 కిలోల గంజాయిని గుర్తించారు. కారులో ఉన్న కడపకు చెందిన సాయికృష్ణ, పవన్‌కుమార్‌రెడ్డి, హైదారాబాద్‌కు చెందిన శ్రీహరిలను అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిసా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి పక్కన గల వనగడలి దగ్గర కొనుగోలు చేసి హైదారాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. కారుతో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి పట్టుకున్న వారిలో ఏఈఎస్ తిరుపతి, ఈఐ రమేష్, హెచ్‌సి కరీం, బాలు, ఈసీ సుధీర్, హరీష్, విజయ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామం వద్ద ఈ నెల 7వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన డిగ్రీ విద్యార్థి ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టర్ నిర్వహించి శుక్రవారం అతడి స్వగ్రామానికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే ఎన్టీఆర్ జిల్లా దేశిపాలెం గ్రామానికి చెందిన వడ్డేపూడి ఉపేంద్ర(20) డిగ్రి రెండవ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామంలో ఉన్న సోదరి ఇంటికి వచ్చాడు. బావకు ఆటో ఉండటంతో పని నిమిత్తం అతడితో కలిసి బోనకల్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ ఢీ కొట్టడంతో తీవ్రంగ గాయ పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని అతడి స్వ గ్రామానికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



ఆలయాల విశిష్టత కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, మే9(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర అష్టదిక్కులా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాల విశిష్టత కరపత్రాలను శుక్రవారం నగరంలోని కాల్వొడ్డు సత్యనారాయణ సహిత ఆంజనేయస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మనదేశ సైనిక స్వీయరక్షణకు మే 22న హనుమాన్ జయంతి వరకు ప్రతీఒక్కరు భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా చదవాలని, పరిషత్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ అధికారులు, అర్చకులు, విశ్వహిందూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించిన 'ఎర్లీబర్డ్'

- రూ.10కోట్ల 73లక్షలు వసూళ్లు
- ఏప్రిల్ 1నుంచి మే 7వరకు డ్రైవ్
- గతేడాది రూ.9కోట్ల 20లక్షలు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే9 (ఆంధ్రజ్యోతి) ముందస్తుప్రాపర్టీ వసూళ్ల(ఎర్లీబర్డ్) లక్ష్యాన్ని ఖమ్మం నగర పాలక సంస్థ చేరుకుంది. ఈ సంవత్సరం సీడీఎంఏ నిర్ణయించిన ఆదాయ వసూళ్ల లక్ష్యాన్ని సాధించారు. 2023-2024లో ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి రూ.9.20 కోట్ల ఎర్లీబర్డ్ వసూళ్లు చేశారు. కాగా ఈ ఏడాది గతేడాదికి మించి రూ.10కోట్లు ముందస్తు ప్రాపర్టీ వసూళ్ల లక్ష్యం పెట్టుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి 30వరకు తొలి విడతలో రూ.10.13కోట్లు వసూళ్లు చేశారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మరో వారం రోజులు గడువు పెంచింది దీంతో మరో రూ.60 లక్షల వసూళ్లు చేశారు. మొత్తానికి 2024-2025 ఏడాదికి లక్ష్యం రూ.10 కోట్లు కాగా రూ.10.73 కోట్లు వసూళ్లు చేసి శభాష్ అనిపించుకున్నారు.

రోడ్డుపై గేదె కళేబరం

వారంరోజులుగా పట్టించుకోని మునిసిపల్ సిబ్బంది

ఖమ్మంరూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు సమీపంలో వారం రోజులక్రితం రోడ్డు ప్రమాదంలో ఓ గేదె చనిపోయింది. అయితే ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపైటీ ఘటన జరిగి వారంరోజులు గడుస్తుండటంతో ఈ కళేబరం దుర్వాసన వస్తోంది. దీంతో ఆ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. వారంరోజులు గడుస్తున్నా సంబంధిత మునిసిపల్ సిబ్బంది పట్టించుకోవడంలేదని స్థానికులు,వాహనదారులు చెబుతున్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలి

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం, మే9(ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు కమ్మ కోమటి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టెలపాడులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉపాధికూలీలకు పనికి తగిన వేతనాలు ఇవ్వలని, కొలలతో సంబంధం లేకుండా రూ.600 ఇవ్వాలన్నారు పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలన్నారు. పని ప్రదేశలో మౌళిక సదుపాయాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామి, నామా అప్పారావు, ఉన్నం నాగేశ్వరరావు ,ఉన్నం నరేష్, పుసులూరిపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై యమపాశాలు

- ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- రేగుల తండాలో భయంభయంగా గిరిజనులు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



ఖమ్మంరూరల్, మే9: (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు ఇళ్లపై వేలాడుతుండంటతో ఆ తండాలో గిరిజనులు భయంభయంగా గడుపుతున్నారు. ఇక్కడ మొత్తం రెండు వందల కుటుంబాలు ఉంటున్నాయి. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదంటున్నారు స్థానికులు.. ఇదీ ఖమ్మంరూరల్ మండలం, కాచిరాజుగూడెం పంచాయతి పరిధిలోని రేగులతండాలో పరిస్థితి.. గ్రామంలో ఎన్నోఏళ్ల క్రితం విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేశారు. అవి పెచ్చులు లేచిపోయి, పూర్తిగా వంగిపోయి ఎప్పుడు విరిగి ఇళ్లపై పడతాయోనని ప్రజలు ప్రాణాలు అరచేతిలోపెట్టుకుని బతుకుతున్నారు.ఈదురుగాలులకు, వర్షాలకు వైర్లు చెట్లకు తగిలి పెద్దఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. ఈ కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, కూలర్లు కాలిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సంబంధిత అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా చెప్పినా పట్టించుకోకపోవడమే కాకుండా అటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మంత్రి ఆదేశాలు భేఖాతర్?

ఇటీవల గ్రామంలో పర్యటనకు వచ్చిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్తులు సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి విద్యుత్ స్థంభాలు, వైర్లు తొలగించడం వాటికి సంబందించిన ఎస్టిమేట్ వేసి అందించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు రూ.2.10లక్షలకు నివేదికి మంత్రికి ఇవ్వగా వెంటనే మంత్రి పొంగులేటి ఈ నిధులను మంజూరు చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదంతా జరిగి సుమారు ఏడాది అవుతుంది. కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి ఇళ్లపై ఉన్న వైర్లు తొలగించాలని ఆదేశించినప్పటికి అధికారులు మాత్రం నేటి వరకు ఆ పనులు చేయకుండా మంత్రి ఆదేశాలను తుంగలో తొక్కారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



విరిగేందుకు సిద్ధంగా ఉన్న స్థంభానికి తాడుతో కట్టిన గ్రామస్తులు

తీరినప్పుడే వస్తారంట
ధరావత్ భాస్కర్ గ్రామస్తుడు



సమస్యలను అధికారులకు చెపితే అసలు పట్టించుకోవడంలేదు.అంతేకాకుండా అధికారులకు తీరినప్పుడే వచ్చి మారుస్తామంటున్నారు. ఈదురు గాలులకు తీగలు ఇళ్లపై పడి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయంగా ఉంది. ఐనా అధికారులు పట్టించుకోవడంలేదు.

పట్టించుకోవడంలేదు
ధారావత్ సంతు గ్రామస్తుడు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజురుచేసి ఏడాది గడస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామంలో స్థంభాలు తొలగించకపోగా అధికారులు ప్రశ్నించిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు మార్చకుంటే సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తాం.

కొద్దిరోజుల్లో పనులు ప్రారంభిస్తాం
ఏఈ రామారావు

విద్యుత్ స్థంభాలు మార్చేందుకు, వైర్లు తొలగించడానికి, తదితర వాటికి సంబందించి నిధులు మంజూరయ్యాయి. అయితే గ్రామాల వారీగా పనులు చేసుకుంటూ వస్తున్నాం. మరికొద్దిరోజుల్లో రేగులతండాలో కూడా పనులు ప్రారంభిస్తాం. త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.

ఎస్‌బీఐ స్టాండింగ్ కౌన్సిల్‌గా క్రిస్టోఫర్



ఖమ్మంలీగల్, మే9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చందిన సీనియర్ న్యాయవాది గోపోజి మోజెస్ క్రిస్టోఫర్‌ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించినట్లు ఆ బ్యాంకు డివిజనల్ జనరల్ మేనేజర్ ఓ ప్రకటన విడుదల చేశారు. స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించటం పట్ల న్యాయవాదులు మువ్వా నాగేశ్వరరావు, పాముల దానయ్య, తెల్లాకుల రమేష్‌బాబు, వంగాల శ్రీనివాసరావు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు నాగస్వరం పుస్తక ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం, మే9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి కోయి కోటేశ్వరరావు రచించిన తాజా కవిత్వ సంకలనం నాగస్వరం పుస్తక ఆవిష్కరణ శనివారం సాయంత్రం జరగనున్నది. న్యూఎరా స్కూల్‌లో జరిగే ఈ సభలో ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న, ప్రముఖ సాహితీవేత్త గుంటూరు లక్ష్మీనరసయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

కేఎంసీ ఉద్యోగుల్లో అలజడి

- 18కు చేరిన బినామీ కార్మికుల సంఖ్య
- అవుట్ సోర్సింగ్ లెక్కలు బయటకు తీస్తున్న అధికారులు
- కమిషనర్‌తో సుదీర్ఘంగా సమావేశమైన ఏఎంసీ



ఖమ్మంసంక్షేమవిభాగం,మే9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పారిశుధ్యంలో అవినీతి కంపు' కథనంపై ఐదు రోజులుగా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించారు. డివిజన్లలో పనిచేసే కార్మికుల్లో ఇప్పటి వరకు 70మంది వరకు విచారణకు హాజరయ్యారు. వారిలో 18మంది పనులు చేయకుండా సమీప బంధువులు, ఇతరులతో పనులు చేయిస్తూ రెగ్యూలర్ పబ్లిక్ హెల్త్ వర్కర్ వేతనాలు పొందుతున్నట్లు విచారణలో తేలింది. మిగిలిన మరో 20 మంది వరకు విచారణకు హాజరు కాలేని పరిస్థితిలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం కేఎంసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, హెవి వేహికిల్ డ్రైవర్లు హాజరయ్యారు.వీరితో పాటుగా అవుట్ సోర్సింగ్ లెక్కలను బయటకు తీశారు.

వేతనాలు పొందుతున్న వారి గుర్తింపు

శానిటేషన్ విభాగంలో 547మంది, ఫాగింగ్ 23, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు 29, గార్డెన్ కార్మికులు 67, శానిటరి జవాన్లు 47, ఆఫీస్ స్టాఫ్ 26, లైబ్రెరీ 5, వాటర్ సప్లయ్ 125, డ్రైవర్లు 6, ట్రాక్టర్ డ్రైవర్లు 26, ఫొటోగ్రాఫర్లు 2, ఎలక్ట్రిషియన్లు 27, గార్డెన్ సూపర్‌వైజర్లు 4, కంప్యూటర్ ఆపరేటర్లు 25, టెక్నికల్ సూపర్‌వైజర్లు 13, హెవీవెహికిల్స్ డ్రైవర్లు 5, స్కిల్డ్ వర్కర్లు 7, డీఆర్‌ఎఫ్ బృందం 19, ఎల్‌ఆర్‌ఎస్ టెక్నికల్ సిబ్బంది 4, రిటైర్డ్ ఎంఆర్వో 1, రిటైర్డ్ హర్టికల్చర్ ఆఫీసర్ 1, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ 1, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఉద్యోగులు 2, మొత్తంగా 1,012 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఖమ్మం నగర పాలక సంస్థలో వేతనాలు పొందుతున్నట్లు గుర్తించారు.

కమిషనర్‌తో సమావేశమైన ఏఎంసీ

ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగుల లెక్కలు తేల్చేందుకు ఐదు రోజుల క్రితమే కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాను విచారణ అధికారిగా నియమించారు. ఇప్పటి వరకు పారిశుధ్య విభాగంతో పాటుగా కార్యాలయంలోని కొన్ని విభాగాలపై ఉద్యోగుల వడపోత పూర్తి చేశారు. ఈ క్రమంలోనే శుక్రవారం కమిషనర్ అభిషేక్ అగస్త్యతో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా సమావేశమయ్యారు. ఉద్యోగుల వారీగా విచారణ వివరాలను కమిషనర్‌కు అందజేసినట్లు తెలిసింది. దీంతో కేఎంసీలోని ఉద్యోగుల్లో అలజడి నెలకొంది.

సందిగ్ధంలో డిగ్రీ వార్షిక పరీక్షలు

- పరీక్ష ఫీజులు చెల్లించని ప్రైవేటు కళాశాలలు
- ఎగ్జామ్ సెంటర్లను ప్రకటించిన అధికారులు



ఖమ్మంఖానాపురంహవేలి, మే9(ఆంధ్రజ్యోతి): డిగ్రీవార్షిక పరీక్షలు సందిగ్ధంలో పడ్డాయి. ఇప్పటికి రెండు పర్యాలయు పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో డిగ్రీ 2,4,6 సెమిస్టర్ విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నాలుగు సంవత్సరాలుగా చెల్లించలేదని,బకాయిలు కోట్లలో పేరుకుపోయాయని, అవి చెల్లిస్తేనే పరీక్షలను సహకరిస్తామని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే కాకతీయ యూనివర్సిటీ అధికారులు మాత్రం లెక్కలేమైనా ఉంటే ప్రభుత్వంతో తేల్చుకోవాలని, నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఏప్రిల్ 22న తొలుత పరీక్షల షెడ్యూల్ విడుదలైనా ప్రైవేటు కళాశాలలు ఫీజులు చెల్లించకపోవడంతో వాయిదా పడ్డాయి. తిరిగి ఏప్రిల్ 28న కూడా పరీక్ష తేదీలు ప్రకటించినా వాయిదా పడ్డాయి. ప్రస్తుతం మే 14వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం జిల్లాలో పరీక్షలు నిర్వహించే కేంద్రాల జాబితాను విడుదల చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే కేంద్రాలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 48 ప్రైవేటు, 8ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 వేల మంది చదువుతున్నారు. గతంలో ప్రైవేటు కళాశాలలో కూడా పరీక్ష కేంద్రాలు ఉండేవి. శుక్రవారం విడుదల చేసిన జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో కేవలం 17మాత్రమే పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. అవి కూడా ప్రభుత్వం, అటానమస్ కాలేజీలు కావడం గమనార్హం. పరీక్ష ఫీజులను కూడా 90శాతం కళాశాలలు చెల్లించలేదు. దీంతో పరీక్ష ఫీజులు చెల్లించిన కళాశాలల విద్యార్థులకే ఎగ్జామ్ సెంటర్లను కేటాయించారు.

భారీగా బకాయిలు...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. ఇప్పటి వరకు ఏడాదికి సుమారు రూ.40కోట్ల చొప్పున ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు చెల్లించాల్సి ఉంది. దీంతో కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. అధ్యాపకులు సిబ్బంది వేతనాలు, కాలేజీల నిర్వహణకు అప్పులు చేయాల్సి వస్తోందని అంటున్నారు. దీంతో తమ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలకు సహకరిస్తామని అంటున్నారు. ఆ దఫాఅయినా పరీక్షలు కొనసాగుతాయా లేక వాయిదా పడతాయా అని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పిహెసి తరఫున వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలను కలెక్టర్ రోగుల, సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆసుపత్రిలో వైద్యుడు వినిత్ రోగిని పరీక్షిస్తున్న తీరును సామాన్య మానవుడిలా పరిశీలించారు. ల్యాబ్‌ను సందర్శించి టెక్నీషియన్‌తో సౌకర్యాలపై అడిగి తెలుకున్నారు. ఇన్‌పేషంట్ గదిలో ఆడపిల్లను ఎత్తుకుని ఉన్న ఓ మహిళ చూసిన కలెక్టర్ స్పందిస్తూ రానున్న కాలంలో ఆడపిల్లదే బంగారు భవిష్యత్తు అని వారికి మరింత ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. వైద్యుల, సిబ్బంది సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి లోపల మందుల గదిని కూడ పరిశీలించారు. అన్ని రకాల మందులు ఉన్నాయా అని ఫార్మాసిస్టు అనుషాను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులు నవ్యకాంత్, వినిత్, నర్సింగ్ ఆఫీసర్స్ ఎం లలీత, జె మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ అక్తర్, మధు, ఆరోగ్యమిత్ర కృష్ణవేణి సిబ్బందిలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్

రెండురోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తాం

పెనుబల్లి, మే9(ఆంధ్రజ్యోతి): కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని రెండురోజుల్లో కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. శుక్రవారం మండాలపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతుల సమస్యలను వివరించారు. కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని పట్టాలు వేసి వర్షం నుంచి కాపాడుకోవాలన్నారు.

నేడు విద్యుత్ కోత

రఘునాథపాలెం,మే9(ఆంధ్రజ్యోతి): మంచుకొండ విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. మంచుకొండ,బూడిదంపాడు, సూర్యతండా,వంకుడోత్‌తండా, సుక్నీతండాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎంవీ పాలెం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి



దయాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ఖమ్మంరూరల్, మే9: (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంవీ పాలెంగ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామానికి చెందిన అఖిలపక్షం నాయకులు కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డికి శుక్రవారం విన్నవించారు. ఎన్నికల సమయంలో ఎంవీ పాలెం గ్రామాన్ని మండల కేంద్రం చేస్తామని హమీ ఇచ్చారని గుర్తు చేశారు. ఖమ్మం రూరల్ పేరుతోనే మండల కేంద్రం చేసి గ్రామంలోనే అన్ని ప్రభుత్వం కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ పేరుతోనే ఎంవీపాలెం గ్రామంలోనే మండల కేంద్రం ఏర్పాటు చేస్తామని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఎంవీ పాలెంలోనే నిర్మించేలా ఏర్పాట్లు చేస్తామని అఖిపలక్షం నాయకులకు హమీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

ఖమ్మంఖానాపురంహవేలి, మే9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం సంభానినగర్‌కు చెందిన ఓ యువతి కడుపునొప్పి తాళలేక ఆత్యహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సంభానినగర్‌కు చెందిన నాగమణి(22)కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి కడుపునొప్పి రావటంతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఆర్డీవో నర్సింహారావు

బోనకల్, మే9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఆర్డీవో నర్సింహారావు తెలిపారు. మండలంలోని చొప్పకట్లపాలెం, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో పాల్గొన్నారు.

ఇసుక దందాపై సర్కార్ నజర్

ఆంధ్రా ఇసుక అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్న అధికారులు



సత్తుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దున ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలోకి ఇసుకను అక్రమంగా రవాణా చేసి భారీ స్థాయిలో వ్యాపారం సాగిస్తున్న అక్రమార్కుల సమాచారం సేకరించేందుకు కొందరు అధికారులు, నిఘావర్గాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఆంధ్రా నుంచి సత్తుపల్లి పరిసర మండలాలకు భారీ స్థాయిలో లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలించి ఈ ప్రాంతంలో అక్రమంగా విక్రయిస్తూ రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నారు. ఇసుక దందాపై ఈ నెల 5వ తేదీన సరిహద్దు దాటుతున్న ఇసుక దందా శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వంలో ఉన్నత వర్గాలు తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ఆంధ్రా నుంచి అక్రమంగా తరలివచ్చే ఇసుకను కట్టడి చేయాలని ఆదేశాలు ఉన్నా ఈ ప్రాంతంలో అందుకు భిన్నంగా వ్యాపారం సాగుతుండటంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించినట్లు తెలిసింది.

నివేదిక కోరిన ప్రభుత్వం

కొద్దినెలలుగా అంధ్రా నుంచి తరలివస్తున్న అక్రమ ఇసుక వాహనాల వ్యవహారంపై పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని ఉన్నతస్థాయి వర్గాలు ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో నిఘా వర్గాలు రంగంలోకి దిగి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు సత్తుపల్లికి చెందిన వారిని మేనేజ్ చేస్తూ ఇసుక దందాకు పాల్పడుతున్నట్లు సమాచారం. చింతలపూడి, విస్సన్నపేట ప్రాంతాలకు చెందిన వారు వారి వాహనాలలో ఇసుకను రవాణా చేస్తున్నట్లు గమనించి సదరు వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, అర్ధరాత్రి సమయంలో ఇసుక అన్‌లోడ్ చేస్తారనే ప్రచారం జరుగుతున్న ప్రాంతాలలో అందుబాటులో ఉండే సీసీ టీవీ ఫుటేజీలను కూడా సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. ఆంధ్రా నుంచి అక్రమంగా నెలల తరబడి ఇసుక తరలించడం వల్ల ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. ఇసుక అక్రమార్కులకు అండగా ఎవరు నిలుస్తున్నారని, అధికారులపై ఒత్తిడి తెచ్చేదెవరు అనే కోణంలో కూడా దృష్టి సారించారు. దీంతోపాటు సత్తుపల్లి ప్రాంతంలో ఇసుకకు సంబందించి ఉన్న లారీ అండ్ టిప్పర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉన్నప్పటికీ వారుకూడా అక్రమ ఇసుక దందాను అడ్డుకోలేని పరిస్థితిల్లో ఉన్నారంటే ఆంధ్రా ఇసుక వ్యాపారులకు ఈ ప్రాంతంలో వెన్నుదన్నుగా నిలుస్తున్న వారు ఎవరు అనేది ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. ఇసుక దందా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ ఏ రకమైన ఇబ్బందులు ఎదురుకాకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారంటే స్థానికంగా వారికి ఉన్న అండదండలు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. తిలాపాపం తలాపిడికెడు అనే విధంగా పరిస్థితి ఉండడం వల్లే అక్రమ ఇసుక వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి

- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

శనివారం 10 మే 2025

వైరా-మధిర సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

రెండురోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తాం

పెనుబల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని రెండురోజుల్లో కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. శుక్రవారం మండాలపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని పట్టాలు వేసి వర్షం నుంచి కాపాడుకోవాన్నారు. అదేవిధంగా తేమశాతం, తాలు లేకుండా ఉన్న ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర వస్తుందన్నారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఐకేపీ సీసీలు చలమయ్య, ప్రసాద్, మోహన్‌రావు, ఏపీఎం ప్రసన్న, కేంద్ర నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఆర్డీవో నర్సింహారావు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ఆర్డీవో నర్సింహారావు తెలిపారు. మండలంలోని చొప్పకట్లపాలెం, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాసు పుస్తకాల్లో పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరీకరణ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కార మార్గం భూ భారతి చట్టం ద్వారా లభిస్తుందన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక దందాపై సర్కార్ నజర్

ఆంధ్రా ఇసుక అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్న అధికారులు



సత్తుపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దున ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలోకి ఇసుకను అక్రమంగా రవాణా చేసి భారీ స్థాయిలో వ్యాపారం సాగిస్తున్న అక్రమార్కుల సమాచారం సేకరించేందుకు కొందరు అధికారులు, నిఘావర్గాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఆంధ్రా నుంచి సత్తుపల్లి పరిసర మండలాలకు భారీస్థాయిలో లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలించి ఈ ప్రాంతంలో అక్రమంగా విక్రయిస్తూ రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నారు. ఇసుక దందాపై ఈ నెల 5వ తేదీన సరిహద్దు దాటుతున్న ఇసుక దందా శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వంలో ఉన్నత వర్గాలు తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ఆంధ్రా నుంచి అక్రమంగా తరలివచ్చే ఇసుకను కట్టడి చేయాలని ఆదేశాలు ఉన్నా ఈ ప్రాంతంలో అందుకు భిన్నంగా వ్యాపారం సాగుతుండటంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించినట్లు తెలిసింది.

నివేదిక కోరిన ప్రభుత్వం

కొద్దినెలలుగా ఆంధ్రా నుంచి తరలివస్తున్న అక్రమ ఇసుక వాహనాల వ్యవహారంపై పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని ఉన్నతస్థాయి వర్గాలు ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో నిఘా వర్గాలు రంగంలోకి దిగి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు సత్తుపల్లికి చెందిన వారిని మేనేజ్ చేస్తూ ఇసుక దందాకు పాల్పడుతున్నట్లు సమాచారం. చింతలపూడి, విస్సన్నపేట ప్రాంతాలకు చెందిన వారు వారి వాహనాలలో ఇసుకను రవాణా చేస్తున్నట్లు గమనించి సదరు వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, అర్ధరాత్రి సమయంలో ఇసుక అన్‌లోడ్ చేస్తారనే ప్రచారం జరుగుతున్న ప్రాంతాలలో అందుబాటులో ఉండే సీసీ టీవీ ఫుటేజీలను కూడా సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. ఆంధ్రా నుంచి అక్రమంగా నెలల తరబడి ఇసుక తరలించడం వల్ల ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. ఇసుక అక్రమార్కులకు అండగా ఎవరు నిలుస్తున్నారని, అధికారులపై ఒత్తిడి తెచ్చేదెవరు అనే కోణంలో కూడా దృష్టి సారించారు. దీంతోపాటు సత్తుపల్లి ప్రాంతంలో ఇసుకకు సంబంధించి ఉన్న లారీ అండ్ టిప్పర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉన్నప్పటికీ వారుకూడా అక్రమ ఇసుక దందాను అడ్డుకోలేని పరిస్థితిలో ఉన్నారంటే ఆంధ్రా ఇసుక వ్యాపారులకు ఈ ప్రాంతంలో వెన్నుదన్నుగా నిలుస్తున్న వారు ఎవరు అనేది ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. ఇసుక దందా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ ఏ రకమైన ఇబ్బందులు ఎదురుకాకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారంటే స్థానికంగా వారికి ఉన్న అండదండలు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. తిలాపాపం తలాపిడికెడు అనే విధంగా పరిస్థితి ఉండడం వల్లే అక్రమ ఇసుక వ్యాపారం నిరాటంకంగా కొనసాగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఆడపిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఓ మహిళకు చెబుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పీహెచ్‌సీ తరపున వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలను కలెక్టర్ రోగుల, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆసుపత్రిలో వైద్యుడు వినిత్ రోగిని పరీక్షిస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ల్యాబ్‌ను సందర్శించి టెక్నీషియన్‌తో సౌకర్యాలపై అడిగి తెలుకున్నారు. ఇన్‌పేషంట్ గదిలో ఆడపిల్లను ఎత్తుకుని ఉన్న ఓ మహిళ చూసిన కలెక్టర్ స్పందిస్తూ రానున్న కాలంలో ఆడపిల్లదే బంగారు భవిష్యత్తు అని వారికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వైద్యుల, సిబ్బంది సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి లోపల మందుల గదిని కూడ పరిశీలించారు. అన్ని రకాల మందులు ఉన్నాయా అని ఫార్మాసిస్టు అనుషాను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులు నవ్యకాంత్, వినిత్, నర్సింగ్ ఆఫీసర్స్ ఎం లలీత, జె మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ అక్తర్, మధు, ఆరోగ్యమిత్ర కృష్ణవేణి సిబ్బందిలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌గా పంచాయతీ కార్యాలయం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో..
- ఎక్సైజ్ అధికారులకు స్వాధీనం చేసిన మునిసిపల్ అధికారులు



ఇకమీదట ఈభవనమే వైరా ఎక్సైజ్ స్టేషన్

వైరా, మే 9 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు దశాబ్దాల నుంచి అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు సొంత భవనం సమకూరింది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో నిరుపయోగంగా ఉన్న పాత పంచాయతీ భవనాన్ని గురువారం ఎక్సైజ్ అధికారులకు వైరా మునిసిపల్ అధికారులు స్వాధీనం చేశారు. 3సంవత్సరాల క్రితం మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వైరా ఉండేది. అయితే 1994-95 ప్రాంతంలో సంపూర్ణ మద్యనిషేదం అమలుచేసిన నేపథ్యంలో మధిర స్టేషన్ పరిధిలో ఉన్న వైరాను విడదీసి ఇక్కడ నాలుగు మండలాలతో ఎక్సైజ్ స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. కొన్ని సంవత్సరాల కిందటి వరకు వైరా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వైరా, తల్లాడ, బోనకల్, కొణిజర్ల మండలాలు ఉండేవి. అయితే బోనకల్ మండలాన్ని మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు. దాంతో ఇప్పుడు మిగిలిన మూడు మండలాల్లో వైరా స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఎక్సైజ్ స్టేషన్‌కు ఇంతవరకు సొంత భవనం లేదు. ప్రతినెల వేలాదిరూపాయలు అద్దెలు చెల్లిస్తూ అరకొర వసతులతో ఉన్న భవనాల్లోనే స్టేషన్ నిర్వహిస్తున్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ స్టేషన్ భవన నిర్మాణానికి స్థానిక శాంతినగర్‌లో నిరుపయోగంగా ఉన్న ఎన్నెస్పీ భూమిని రెవెన్యూ శాఖ కేటాయించింది. అయితే భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టడంలో ఎక్సైజ్ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించారు. దీంతో ఆ స్థలాన్ని వేరే ప్రజావసరాలకు ఉపయోగించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నిర్ణయించారు. చివరికి భట్టి విక్రమార్క ఆదేశాలతో పాత పంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించారు. 2006నుంచి ఈ భవనం నిరుపయోగంగా ఉంటుంది. అయితే మూడేళ్ల కిందట మునిసిపాలిటీకి చెందిన రూ.ఆరు లక్షలు వెచ్చించి ఈ భవనానికి పూర్తిస్థాయి మరమ్మతులు నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ దీన్ని పునఃప్రారంభించారు. పట్టణ దవాఖానా ఇతరత్రా అవసరాలకు దీన్ని ఉపయోగించాలని తలపెట్టినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. మునిసిపాలిటీకి చెందిన బ్లీచింగ్ ఇతర వస్తువులను ఇక్కడ నిల్వ చేస్తున్నారు. ఎంతో పటిష్టంగా ఉన్న ఈ భవనాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించాలని భట్టి విక్రమార్క ఆదేశించటం, జిల్లా ఎక్సైజ్ డీసీ జనార్ధన్‌రెడ్డి, ఈఎస్ నాగేందర్‌రెడ్డి పరిశీలించి వెళ్లి కలెక్టర్‌కు నివేదిక అందించటం ఆ వెంటనే ఆయన ఆదేశాలు ఇవ్వడం, మునిసిపల్ అధికారులు స్థానిక ఎక్సైజ్ అధికారులకు స్వాధీనం చేయడం వెంటవెంటనే జరిగిపోయాయి.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

సత్తుపల్లిరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఓ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నవభారత్ డిగ్రీ కాలేజ్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్ఎస్.రెడ్డి, జీవీ లింగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ (బీఎస్సీ) 2020లో పాసైన అభ్యర్థులు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వైరా ఎస్ఐగా రామారావు

వైరా, మే 9 (ఆంధ్రజ్యోతి): వైరా ఎస్ఐగా పి.రామారావును నియమిస్తూ ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గడచిన 15నెలలుగా వైరా ఎస్ఐగా పనిచేస్తున్న ఏ.వంశీ కృష్ణ భాగ్యరాజ్‌ను సీఏఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న రామారావును వైరా ఎస్ఐగా నియమించారు.

పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నర్సింహారావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలాల్లో క్లస్టర్ల వారీగా మూడు పాఠశాలలనే ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఆలోచన చేయడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలను ఏం చేస్తారని ప్రశ్నించారు. స్పష్టమైన విధి విధానాలను రూపొందించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా నూతన విధానాలను ప్రవేశపెడితే ప్రయోజనం ఉండదన్నారు. ఉన్న పాఠశాలలను బలోపేతం చేసి విద్యను అందించడం వల్ల కూడా మంచి ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 13వ తేది నుంచి నిర్వహించనున్న టీచర్ల శిక్షణలను ఎండ తీవ్రతల దృష్ట్యా ఒకపూట మాత్రమే నడపాలని, డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు వల్లంకొండ రాంబాబు, గుగులోతు రామకృష్ణ, బాణోతు రాందాస్, నాగేశ్వరరావు, షరీఫ్, రమేష్, తుల సీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై. వెంకటేశ్వర్లు

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేయాలని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని జానకీపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ శిక్షణలను మండల కేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. 317 జీవో ద్వారా జరిగిన నష్టాన్ని నివారించి మెడికల్ గ్రౌండ్, స్పౌజ్ ఉపాధ్యాయుల విషయంలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల నమోదును పెంచేలా కష్టపడాలని సూచించారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పీఆర్టీయు జిల్లా, మండల నాయకులు కొమ్ము శ్రీనివాసరావు, చింతల రవి కుమార్, కొనకంచి రామ్మోహన్, రవి కిరణ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు

ఆశాకార్యకర్తల సమ్మె నోటీసు

ఎర్రుపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాధ్యుడు డాక్టర్ కార్తీక్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆశాకార్యకకర్తల మండల అధ్యక్షురాలు సుధారాణి మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రతిరోజు ప్రజలకు నిర్విరామంగా వైద్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే జాతీయ సమ్మెను అన్ని కార్మికసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

గ్రామ సమైక్యల రికార్డుల అంతర్గత తనిఖీలు



గ్రామ సమైక్యల రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్లు

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ఉషోదయ మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం గ్రామ సమైక్యల రికార్డుల అంతర్గత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీఆర్డీఏ కార్యాలయం తరుపున విచ్చేసిన ఆడిటర్లు జనార్ధన్, ప్రశాంతరెడ్డి, సీతారాములు ఈ తనిఖీల్లో ప్రధానంగా 2024-25 సంత్సరానికి గాను మండలంలో ఉన్న 22 గ్రామ సమైక్యలు పుస్తక నిర్వహణ, ఆదాయ వ్యయాలు, వసూళ్లు, చెల్లింపులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, వీవోఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరిగూడెం 33/11కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం నేడు ఉదయం 8.30నుంచి 11.30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ యు.శరత్‌బాబు శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, కిన్లే ఫ్యాక్టరీ ఏరియా, సిద్దారం మెయిన్ రోడ్, రాజీవ్‌నగర్‌లలో అంతరాయం ఏర్పడనుందని, సహకరించాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ గృహాల సర్వే తుది కసరత్తును కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్ డివిజన్ పరిధిలోని కప్పలబంధం, మల్లవరం గ్రామాల్లో శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించటం జరిగిందన్నారు. సతుపల్లి నియో.జకవర్గం పరిధలో వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల పరిధిలో కలిపి మొత్తం 3,500 గృహాలు మంజూరు కాగా అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై గామాల్లో ఇప్పటికే సర్వే చివరి దశకు చేరుకున్నాదని శనివారం నాటికి మండలాల నుంచి పూర్తి స్థాయి నివేదిక వస్తుందన్నారు. లబ్ధిదారుల జాబితాల నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపటం జరుగుతుందని ఆర్డీవో వివరించారు. ఇప్పటికే పలు దఫాలుగా మండలాల స్థాయిలో అధికారులు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి విచారణలు సమగ్రంగా జరపటం జరిగిందని అన్నారు.

ఇంకాను సాఫ్ట్‌వేర్ అనుసంధానంతో లబ్ధిదారుడు అర్హుడా కాదా అన్నది నిర్ధారణ ప్రక్రియ కూడ చెప్పట్టడం జరిగిందన్నారు. తాను కూడ తుది పరిశీలనగా కల్లూరు, తల్లాడ సత్తుపల్లి మండలాల పరిధిలో సగుటున ఐదు గ్రామాలను సందర్శించి లబ్ధిదారులు స్థితిగతులపై పరిశీలించి మండల స్థాయిలో అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, రెవెన్యూశాఖ తరపును సర్వే విధులు నిర్వహించారని అన్నారు.

మధిర టౌన్ ఎస్‌హెచ్‌వోగా రమేష్

మధిర రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా సీఐ దోమల రమేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి ఎస్‌హెచ్‌వోగా ఎస్ఐ స్థాయి అధికారి ఉండేవారు. పోలీస్ స్టేషన్ల అప్‌గ్రేడ్‌లో భాగంగా సీఐ ర్యాంకు అధికారిని మధిర టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ పైనుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో దోమల రమేష్ బాధ్యతలు తీసుకున్నారు.

ప్రమాదకరంగా జన్నారం బ్రిడ్జి



రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉన్న వంతెన

ఏన్కూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నారం ఏరు బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది.. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేక తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరం.. రక్షణ గోడలు లేక వాహనాలు వాగులో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో వాహనాలతో పాటు మనుషులు కూడా కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నారు. తాజాగా శుక్రవారం బ్రిడ్జిపై నుంచి వాగులో లారీపడి ప్రమాదం జరిగింది. ఈ రహదారి గుండా ఖమ్మం, కొత్తగూడెంకు వేలాది వాహనాలు వెళ్తుంటాయి. వెంటనే రక్షణ గోడలు ఏర్పాటుచేసి రేడియం స్టిక్కర్లను అతికించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతులు పండించిన ప్రతి గింజను కొంటాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సింహారావు

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని, రైతులు అధైర్య పడవద్దని ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు భరోసా ఇచ్చారు. బోనకల్ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సన్న రకాలు కావడం వల్ల మిల్లర్లు కొనుగోళ్ల పట్ల ఆసక్తి చూపడం లేనందున కల్లాల్లోనే ఎక్కువ రోజులు పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాంటాలు వేసి ఎగుమతి చేసే బాధ్యత వరకు అన్ని తాము చూసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, రేణుక తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

కొనసాగుతున్న రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ



రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు

బోనకల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎల్), రాయన్నపేట, రావినూతల, ముష్టికుంట్ల, చిన్న బీరవల్లి రైతు వేదికల్లో గడచిన రెండు రోజులుగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. రైతు వేదికల్లో శుక్రవారం కూడా రైతుల నుంచి ఏఈవోలు ఆధార్ కార్డు, పాసు పుస్తకాల జిరాక్స్‌లను సేకరించారు. ప్రతి రైతుకు ఆధార్ మాదిరిగానే ఒక విశిష్ట సంఖ్య(11 అంకెలు) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసే లక్ష్యంతో కేంద్రం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి రైతు తమ భూమికి సంబంధించిన వివరాలు, ఆధార్ లింక్ ఐన ఫోన్ నంబర్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా మిషన్ లాంటి పథకాలు అందడానికి ఈ గుర్తింపు కార్డులు అవసరంగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియతో సంబంధం లేకపోయినా రైతులు మాత్రం భారీ సంఖ్యలో రైతు వేదికల వద్దకు వచ్చి తమ ఆదారాలను ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బందం రజిత, పండగ అనూష, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, షేక్ హుస్సేన్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

భారత సైనిక దళాల క్షేమం కోసం చండీసహిత రుద్రహోమం

ఎర్రుపాలెం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేశ సైనికదళాలు క్షేమంగా ఉండాలని శుక్రవారం చండీసహిత రుద్రహోమం ఎంతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాల మేరకు అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా జమలాపురం ఆలయంలో భారత సాయుధ దళాలు క్షేమంగా ఉండి దేశ గౌరవాన్ని నిలపడంలో వీరోచితంగా పోరాడాలని ఈ హోమం నిర్వహించారు. దశాబ్దాలుగా దేశంలో అమాయక ప్రజల రక్తాన్ని చిందిస్తున్న లష్కరేతోయిబా జైషే మహ్మద్ , వంటి ఉగ్ర గ్రూపుల శిక్షణ శిబిరాలను సాయుధ దళాలు ధ్వంసం చేయడం భగవత్ సంకల్పమని వేదపండితులు పేర్కొన్నారు. దేశ వైమానిక దాడులకు ఎటువంటి అడ్డంకులు రాకుండా పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండాలని, అత్యంత బలమైన దేశంగా భారతావని నిలబడాలని హోమ సంకల్పం చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయమార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సూపరిటెండెంట్ కే.వి జయకుమారి తదితరులు పాల్గొన్నారు.